సాక్షి మంచిర్యాల

గురువారం । 11 । జనవరి । 2024

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జైపూర్: ప్రజాపాలన దరఖాస్తు ఫారాల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో సత్యనారాయణతోపాటు అధికారులు పాల్గొన్నారు.



వైద్యులు, సిబ్బందిని నియమించాలి

చెన్నూర్: చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నియమించాలని, తలసేమియా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను ఎమ్మెల్యే గడ్డం వివేక్ కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి విన్నవించారు.

గరిష్టం/కనిష్టం
30.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంధుల జీవితాల్లో వెలుగు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి. సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అంధుల కోసం లిపిని సృష్టించి జీవితంలో వెలుగు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో జిల్లా సంక్షేమశాఖ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బ్రెయిలీ క్యాలెండర్ ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అంధులను శాలువాలతో సత్కరించి, ఉపకరణాలు పంపిణీ చేశారు.

25న ఓటరు దినోత్సవ వేడుకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 25న 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ ప్రకటనలో తెలిపారు. 'ఓటు లాంటిది ఇంకొకటి లేదు –నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో అర్హులు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చుతామని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్



సమస్యలు తెలుసుకుంటున్న కర్ణన్

మంచిర్యాలటౌన్: మాతాశిశు ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, నూతనంగా నిర్మిస్తున్న మాతాశిశు ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్.వీ.కర్ణన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డులో రూ.205 కోట్లతో చేపట్టిన మాతాశిశు ఆసుపత్రి భవన నిర్మాణ పనుల సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం గోదావరి ఒడ్డున ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, సివిల్ సర్జన్ రెసిడెంట్ వైద్యాధికారి డాక్టర్ భీష్మ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి సందర్శించారు. గర్భిణులకు ఎలాంటి సమస్య లేకుండా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు.

డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ కోటేశ్వర్

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్)గా రేడియాలజిస్టు డాక్టర్ కోటేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీసీహెచ్‌ఎస్‌గా పనిచేసిన డాక్టర్ అరవింద్ తన ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో డాక్టర్ కోటేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సముదాయంలోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయం సిబ్బంది ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



చెన్నూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

దండేపల్లి: గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజా దారాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తాళ్లపేట ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు హెచ్చరించారు. దండేపల్లి, మేదరిపేట, తాళ్లపేట కిరాణ దుకాణాల్లో పోలీసులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, దండేపల్లి కస్తూర్బా పాఠశాలల్లో చైనా మాంజా దారాలతో జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. డీఆర్వోలు పోచమల్లు, ప్రమోద్, సిబ్బంది హన్మంతరావు, అనిత, సాగర్, అనిల్ పాల్గొన్నారు.

కాసిపేటలో..

కాసిపేట: మండలంలోని కోండపూర్ యాపలో పతంగులు విక్రయించే దుకాణాల్లో అటవీశాఖ డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. నిషేధిత మాంజాలు విక్రయిస్తే చర్యలు తీసుకోనున్నట్లు వ్యాపారులను హెచ్చరించారు. బీట్ అధికారులు కుమారస్వామి, సురేష్ పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్: పట్టణంలోని కిరాణ, జనరల్ స్టోర్స్‌లలో ఎఫ్‌ఆర్వో శివకుమార్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎఫ్‌ఎస్‌వోలు బాలకృష్ణ, వెంకట్, జ్యోతి, రవీందర్ పాల్గొన్నారు.

పూర్తయ్యేనా ..?



మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు

- ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ
- ఈ నెల 17లోగా పూర్తి చేయాలని ఆదేశం
- సంక్రాంతి పండుగకు ముందే పూర్తి చేసేందుకు యత్నం

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, బుధవారం వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసినవి

మండలం	వచ్చినవి	నమోదు	శాతం
బెల్లంపల్లి	9,096	5,798	63.74
భీమారం	5,256	3,473	66.08
భీమిని	5,141	3,396	66.06
చెన్నూరు	10,363	6,418	61.93
దండేపల్లి	16,928	11,965	70.68
హాజీపూర్	11,080	7,251	65.44
జైపూర్	11,544	5,289	45.82
జన్నారం	18,517	8,085	43.66
కన్నెపల్లి	6,482	3,286	50.69
కాసిపేట	8,605	7,298	84.81
కోటపల్లి	11,398	6,132	53.80
లక్సెట్టిపేట	10,166	5,728	56.34
మందమర్రి	4,671	3,647	78.08
నెన్నెల	7,941	4,256	53.60
తాండూర్	10,475	8,582	81.93
వేమనపల్లి	6,295	3,135	49.80
మున్సిపాలిటీల్లో...			
బెల్లంపల్లి	15,514	8,533	55.00
చెన్నూరు	7,249	4,354	60.06
క్యాతన్‌పల్లి	9,021	6,244	69.22
లక్సెట్టిపేట	5,253	3,223	61.36
మంచిర్యాల	29,465	20,862	70.80
మందమర్రి	13,333	6,977	52.33
నస్పూరు	16,796	11,498	68.46
మొత్తం	2,50,589	1,55,430	62.03

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ సాగుతోంది. ఈ నెల 17లోగా పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం వివరాల నమోదు చేస్తోంది. జిల్లాలోని 16మండలాలు, ఏడు మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొన్ని చోట్ల నెమ్మదిగా, మరికొన్ని చోట్ల వేగవంతంగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. మండలాల్లో 1,53,958 దరఖాస్తులు రాగా, బుధవారం మధ్యాహ్నం వరకు 93,739 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. 60,219 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఏడు మున్సిపాలిటీల్లో 96,631 దరఖాస్తులు రాగా 61,691 ఆన్‌లైన్‌లో నమోదు కాగా, 34,940 నమోదు చేయాల్సి ఉంది. జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీల్లో కలిపి 2,50,589 దరఖాస్తులకు గాను 1,55,430 ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మిగిలిన వాటిని 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా, పలు సాంకేతిక సమస్యలతో ఆలస్యం అవుతోంది.

పండుగ సెలవులు

ఈ నెల 17లోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లతోనూ నమోదు చేపట్టారు. దరఖాస్తుల్లో ఉన్నది ఉన్నట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఒక్కో దరఖాస్తుకు దాదాపుగా 10 నిమిషాల సమయం తీసుకుంటోంది. ఒక్కో దరఖాస్తుకు ఆపరేటర్‌కు రూ.15 ఇచ్చేందుకు నిర్ణయించారు. వెబ్‌సైట్ సక్రమంగా ఓపెన్ కాకపోవడం, అందరూ ఒకేసారి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయడంలో కొంత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు వస్తుండడంతో ఆపరేటర్లు వస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పండుగ సెలవులకు ముందుగానే ఆన్‌లైన్ ప్రక్రియను జిల్లాలో పూర్తి చేసేందుకు అధికారులు ఎక్కువ సంఖ్యలో కంప్యూటర్లను ఏర్పాటు చేసి, ఆపరేటర్లతో మూడు షిఫ్టుల్లో రాత్రి, పగలు పని చేయిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదైతేనే..

దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాతనే ఒక్కో దరఖాస్తుకు ఒక్కో ఐడీ ఆన్‌లైన్‌లోనే నమోదవుతుంది. ఆ ఐడీ ఆధారంగానే దరఖాస్తుదారుడికి సంబంధించిన అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో చూసేందుకు అవకాశం ఉంది. ఆ నంబర్ ఆధారంగానే వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు స్థితి, ఏయే పథకాలకు అర్హులుగా ఉన్నారనే విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దరఖాస్తులో నమోదు చేసిన సెల్ నంబర్‌కు ఎలాంటి ఓటీపీ రావడం లేదని, కానీ కొందరు సైబర్ నేరగాళ్లు ఓటీపీ వచ్చిందని, చెబితేనే ప్రజాపాలన పథకాలకు అర్హులంటూ మోసం చేస్తున్నారని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు ఇలాంటి ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ఎలాంటి ఓటీపీ గానీ, వెబ్‌సైట్ లింక్‌లను లబ్ధిదారుల సెల్ నంబర్లకు పంపించడం జరగదని మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. ఓటీపీలను చెప్పకపోవడం, వచ్చిన వివిధ రకాల వెబ్‌సైట్ లింక్‌లను ఓపెన్ చేయకుండా ఉండాలని సూచించారు.

ఏసీబీ వలలో అవినీతి చేపలు

- పట్టుబడిన పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి
- బిల్లు చేయడానికి రూ.15వేలు డిమాండ్



లంచం డబ్బులతో ఏఈ, పంచాయతీ సెక్రెటరీ

బెల్లంపల్లి: క్రీడా మైదానంలో చేసిన మట్టి పనుల బిల్లు చేయడానికి లంచం డిమాండ్ చేసిన పీఆర్ ఏఈ, పంచాయతీ కార్యదర్శిలను ఏసీబీ అధికారులు బుధవారం వలపన్ని పట్టుకున్నారు. బెల్లంపల్లిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన రామగోని అశోక్‌గౌడ్ కొన్ని నెలల క్రితం గ్రామంలోని క్రీడామైదానంలో మట్టి డంపింగ్, భూమి చదును పనులు చేశాడు. రూ.150లక్షలు బిల్లు అంచనా చేయాల్సి ఉంది. బిల్లు చేయకుండా పంచాయతీరాజ్ శాఖ ఏఈ పోగుల పరంజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వీరబాబు తీవ్ర కాలయాపన చేస్తున్నారు. మూడు నెలల క్రితం ఏఈ పరంజ్యోతి డెప్యూటేషన్‌పై కాసిపేట మండలానికి బదిలీ అయ్యాడు. అయినా బిల్లు చేయకుండా వాయిదా వేస్తూ వస్తున్నాడు. బిల్లు చేయడానికి గాను రూ.15వేలు డిమాండ్ చేశాడు. అశోక్‌గౌడ్ అంగీకరించడంతో డబ్బును పంచాయతీ కార్యదర్శి వీరబాబు ద్వారా అందజేయాలని సూచించాడు. దీంతో బుధవారం ఏఈకి సమాచారం అందించి కార్యదర్శి వీరబాబుకు మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద రూ.15వేలు నగదు అందజేశాడు. అప్పటికే ఏసీబీ అధికారులకు సమాచారం ఇవ్వగా కార్యాలయం వద్ద మాటు వేసి ఉన్నారు. వీరబాబు రూ.15వేలు తీసుకుని ఏఈకి అందజేస్తుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. డబ్బు స్వాధీనం చేసుకుని ఏఈ, కార్యదర్శిలను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమేష్ మాట్లాడుతూ ఎవరైనా లంచం అడిగితే సమాచారం ఇవ్వాలని అన్నారు. దాడిలో ఏసీబీ సీఐలు ఏ.తిరుపతి, సునీల్, జే.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్బంది పెట్టడంతోనే పట్టించాను



మట్టి పనుల బిల్లు రూ.1.50 లక్షలు ఎస్టిమేట్ చేయకుండా ఏఈ, సెక్రెటరీ ఇబ్బందులకు గురి చేశారు. రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. అధికారులను ఆశ్రయించి పట్టించాను. – **బాధితుడు అశోక్‌గౌడ్, పెర్కపల్లి**

నేడే అవిశ్వాస తీర్మానం

- మంచిర్యాల మున్సిపాలిటీలో సమావేశం
- తాజాగా చైర్మన్ పెంట రాజయ్య రాజీనామా
- ఇప్పటికే వైస్ చైర్మన్..


రాజయ్య


ఉప్పలయ్య


సల్ల మహేశ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై గురువారం అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహణకు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీలో 36వార్డులు ఉన్నాయి. 26మంది బీఆర్ఎస్, తొమ్మిది మంది కాంగ్రెస్, ఒకరు బీజేపీ కౌన్సిలర్లు ఉండగా.. బీఆర్ఎస్‌కు చెందిన 17మంది కౌన్సిలర్ల చేరికతో కాంగ్రెస్ పార్టీ సభ్యుల బలం 26కు చేరింది. చైర్మన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ హైదరాబాద్ సమీపంలోని శిబిరానికి వెళ్లిన కౌన్సిలర్లు గురువారం నేరుగా మున్సిపల్ కార్యాలయంలో జరిగే సమావేశానికి హాజరు కానున్నారు.

నెగ్గనున్న అవిశ్వాసం

మున్సిపల్ వైస్‌చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ మంగళవారం తన పదవికి రాజీనామా చేయగా, తాజాగా బుధవారం చైర్మన్ పెంట రాజయ్య రాజీనామా చేస్తూ కలెక్టర్‌కు లేఖ అందించారు. సమావేశానికి ముందే ఇద్దరూ రాజీనామా చేయడంతో సులభంగా అవిశ్వాసం నెగ్గే అవకాశం ఏర్పడింది. అవిశ్వాసాన్ని ఆపేందుకు కోర్టు ద్వారా స్టే తీసుకు రావాలని భావించినా.. చివరి క్షణంలో రాజీనామా చేయడం గమనార్హం. సమావేశానికి కనీసం మూడు రోజుల ముందు రాజీనామా చేసి ఉంటే సమావేశం రద్దుకు అవకాశం ఉండేదని అధికారులు చెబుతున్నారు. ఒకట్రెండు రోజుల ముందు రాజీనామా చేయడం వల్ల సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ చేతుల్లోకి..

మారిన రాజకీయ సమీకరణాలతో మున్సిపాలిటీ పాలన కాంగ్రెస్ పార్టీ చేతుల్లోకి మారనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి, ఎమ్మెల్యేగా కొక్కిరాల ప్రేంసాగర్‌రావు గెలుపొందడంతో రాజకీయ మార్పు మొదలైంది. ఎన్నికలకు ముందే కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరగా.. ఎన్నికల ఫలితాల అనంతరం మరికొందరు వెళ్తున్నట్లు తెలిసినా ఆపలేకపోయారు. పెంట రాజయ్య చైర్మన్‌గా ఉండగానే, బీఆర్ఎస్ పార్టీకే చెందిన కౌన్సిలర్ బోరిగం శ్రీనివాస్ తనకు చైర్మన్ పదవి ఇస్తే కౌన్సిలర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా చూస్తానని ప్రయత్నించినట్లు తెలిసింది. నూతన చైర్మన్‌గా కౌన్సిలర్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌గా కౌన్సిలర్ సల్ల మహేశ్‌లను ఎన్నుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

బీఆర్ఎస్ వ్యూహాత్మక ఎత్తుగడ

- సొంత పార్టీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస తీర్మానం
- 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్‌కు నోటీసు



అవిశ్వాసంపై కలెక్టర్‌కు నోటీసు ఇస్తున్న కౌన్సిలర్లు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మాన విషయంలో బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానానికి సొంత పార్టీ కౌన్సిలర్లు బుధవారం నోటీసు ఇవ్వడం చర్చనీయాంశమైంది. తామే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే ఇతరులకు ఇప్పట్లో ఆ అవకాశం ఉండదని, మరో ఆర్నెల్లు గడిస్తే అసలు అవిశ్వాసం పెట్టడమే కుదురనీయకుండా చేయాలని ఈ ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్ జంగం కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డిలపై అవిశ్వాసం ప్రతిపాదిస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్‌కు 16 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసు అందజేశారు. వాస్తవానికి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తున్నదని తెలిసే.. బీఆర్ఎస్ ముందస్తుగా ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా, 9వ వార్డుకు చెందిన పారుపెల్లి తిరుపతి(ఎస్సీ)ని మున్సిపల్ చైర్మన్‌గా, 8వ వార్డుకు చెందిన అలుగుల శ్రీలతను వైస్ చైర్‌పర్సన్‌గా చేసేందుకు నిర్ణయించినట్లు సమాచారం. ఈ వ్యవహారమంతా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కనుసన్నల్లోనే జరిగినట్లు పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది.

మ్యాజిక్ ఫిగర్‌కు పోటాపోటీ

- శిబిరాలకు ఇరువర్గాల సభ్యులు
- ఒకరి కోసం నిర్వాహకుల తండ్లాట

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన నేపథ్యంలో మ్యాజిక్ ఫిగర్ కోసం రెండు వర్గాలు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పక్షాలు వేర్వేరుగా క్యాంపులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 12న అవిశ్వాసంపై మున్సిపాలిటీలో ఓటింగ్ జరగనుంది. అవిశ్వాసం ప్రతిపాదించిన బీఆర్ఎస్ పార్టీ నెగ్గడానికి 22 మందికి తగ్గకుండా సభ్యుల బలాన్ని కలిగి ఉండాల్సి ఉంది. అవిశ్వాసం వీగిపోవడానికి ప్రత్యర్థి వర్గానికి 12 మంది సభ్యుల మద్దతు అనివార్యం. మున్సిపాలిటీలో 34 మందికి గాను 33 మంది ఉన్నారు. బీఆర్ఎస్‌కు 21మంది, కాంగ్రెస్ పక్షాన 11 మంది ఉన్నట్లు చెబుతున్నారు. బీజేపీకి ఒక సభ్యురాలు ఉన్నారు. ఆ రెండు వర్గాల్లో ఏ వర్గం ప్రత్యర్థిపై విజయం సాధించాలన్నా మరో సభ్యుడి మద్ద తు కీలకంగా మారింది. ఆ ఒకరి మద్దతు కోసం రెండు రోజులుగా తీవ్రస్థాయిలో యత్నాలు జరుగుతున్నాయి. భారీగా తాయిలాల ఆశ చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నిన్నా మొన్నటి వరకు ఓ వర్గానికి మద్దతు ఇస్తానని అభయం ఇచ్చి ప్రస్తుతం ప్లేట్ ఫిరాయించినట్లుగా తెలుస్తోంది. శిబిరానికి తీసుకెళ్లడానికి రెండు వర్గాలు పోటాపోటీగా యత్నాలు చేస్తున్నాయి. బుధవారం ఆ సభ్యుడి పార్టీ అధినాయకుల దృష్టికి మద్దతు అనివార్యమైన విషయాన్ని తీసుకెళ్లి సహకరించాల్సిందిగా ఓ వర్గం కోరినట్లు తెలుస్తోంది. అందుకు పార్టీ జిల్లా బాధ్యుడు సానుకూలతను వ్యక్తం చేసినట్లు చెబుతుండగా సదరు సభ్యుడు తెలివిగా తన సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి ఎవరికీ అందుబాటులోకి రాకుండా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆఖరు నిమిషంలో ఏ పక్షం వైపు మొగ్గు చూపుతారో తెలియని పరిస్థితులు ఏర్పడగా, అవిశ్వాసం నెగ్గుతుందా లేదా వీగిపోతుందా అని ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

గ్రంథాలయం అస్తవ్యస్తం

- లైబ్రరీల్లో వెక్కిరిస్తున్న ఖాళీలు
- సిబ్బంది కొరతతో ఇబ్బందులు
- గ్రంథాలయ పాలక కమిటీలు రద్దు
- జిల్లా గ్రంథాలయ పర్సన్ ఇన్‌చార్జిగా అదనపు కలెక్టర్ రాహుల్



మంచిర్యాల గ్రంథాలయం ముఖద్వారం



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు

మంచిర్యాలఅర్బన్: అపార విజ్ఞానానికి నిలయాలైన గ్రంథాలయాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఏళ్ల తరబడి ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జీలతో నెట్టుకు రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శితో సహ అటెండర్ వరకు ఇతర గ్రంథాలయాల నుంచి సర్దుబాటులో వచ్చినవారే కావడం గమనార్హం. ఇక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందికి పండుగ, వారాంతపు సెలవులు దొరకని పరిస్థితి నెలకొంది. వందలాది మంది పాఠకులు రావడం వల్ల పుస్తకాలపై పర్యవేక్షణ కష్టతరంగా మారుతోంది. గ్రంథాలయాల్లో పోస్టుల ఖాళీలతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

డిప్యూటేషన్‌లే..

మంచిర్యాల జిల్లా కేంద్ర గ్రంథాలయం 1960లో ఏర్పాటు చేయగా.. గ్రేడ్–2గా అప్‌గ్రేడ్ చేశారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తెరిచి ఉంచాల్సి ఉండగా.. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 9గంటల వరకు తెరిచి ఉంచాల్సి వస్తోంది. ప్రతీ రోజు వచ్చే పాఠకులు 300 మందికి పైగా ఉంటారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు 100 నుంచి 200 మంది వరకు ఉంటారు. గ్రంథాలయంలో పోస్టులన్నీ ఖాళీగానే ఉ న్నాయి. కార్యదర్శితోపాటు ఇద్దరు లైబ్రేరియన్లు, కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, రికా ర్డు అసిస్టెంట్, అటెండర్, వాచ్‌మెన్‌ను నియమించాల్సి ఉంది. గ్రేడ్–2గా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత గ్రంథాలయంలో కార్యదర్శిగా ఇన్‌చార్జిని నియమించా రు. సిద్దిపేట, పెద్దపల్లి గ్రంథాలయం కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తుండడంతో ఇక్కడ ఇబ్బందులు తప్పడం లేదు. లైబ్రేరియన్‌ను జన్నారం నుంచి, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ అటెండర్లను బెల్లంపల్లి, మందమర్రి నుంచి సర్దుబాటు చేశారు. సమీపంలోని గ్రంథపాలకులు, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

ఇవేమి డిప్యూటేషన్లు

ఉద్యోగుల డిప్యూటేషన్లు గందరగోళంగా మారాయి. జన్నారం లైబ్రేరియన్‌కు కీలకమైన మంచిర్యాల కేంద్ర గ్రంథాలయంతోపాటు 120కిలోమీటర్ల దూరం ఉండే వేమనపల్లి, కోటపల్లికి డిప్యూటేషన్ ఇచ్చారు. వారంలో రెండ్రోజులు ఒక్కో గ్రంథాలయానికి వెళ్లాల్సి ఉన్నా నాలుగు గ్రంథాలయాల కార్యకలాపాలు చూడడం ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి.

- చెన్నూర్ లైబ్రేరియన్‌కు జైపూర్, తాండూర్ నుంచి లక్సెట్టిపేట, కాసిపేట నుంచి బెల్లంపల్లి, నెన్నెల నుంచి మందమర్రికి లైబ్రేరియన్లకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు.
- దండేపల్లి లైబ్రేరియన్, ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వర్తించే భీమారం గ్రంథాలయానికి చెందిన ఇద్దరికి మినహాయింపు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన వారికే ఇంచార్జి ఇచ్చి మిగతా వారికి ఎందుకు ఇవ్వడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది.
- ఇంచార్జీలు పక్క పక్క మండలాలకు చెందిన వారికి కాకుండా దూర ప్రాంతంలో ఉన్న వారిని నియమించడమేమిటో తెలియకుండా పోతోంది. ఒక్కరికే రెండు నుంచి మూడు సంస్థల బాధ్యతలు అప్పగించడం వల్ల పూర్తిస్థాయి న్యాయం చేయలేరని పలువురు పేర్కొంటున్నారు. ఇంచార్జీగా కేటాయించిన గ్రంథాలయాలకు లైబ్రేరియన్ వెళ్లినప్పుడు మిగతా లైబ్రరీలను మూసి ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గ్రంథాలయ పాఠకులు, చందాదారులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

జిల్లా గ్రంథాలయాల పర్సన్ ఇంచార్జీగా రాహుల్

ప్రభుత్వం గ్రంథాలయ పాలక కమిటీ రద్దు చేయడంతో నూతన చైర్మన్‌తోపాటు సభ్యులను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం పర్సన్ ఇంచార్జీగా అదనపు కలెక్టర్ రాహుల్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కొత్త పాలకవర్గం ఏర్పాటయ్యే వరకు పదవీలో కొనసాగనున్నారు. అస్తవ్యస్తంగా ఉన్నా గ్రంథాలయ ఉద్యోగుల డిప్యూటేషన్లతోపాటు ప్రస్తుత పోటీ పరీక్షల పుస్తకాలు కొనుగోలుపై ప్రత్యేక చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 15గ్రంథాలయాలు ఉండగా.. ఇందులో బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల గ్రేడ్–2గా ఉన్నాయి. సుమారు 1,06,963 పుస్తకాలు ఉన్నాయి. దిన పత్రికలతోపాటు వివిధ రకాల వార, పక్ష, మాస పత్రికలు, బాలసాహిత్యం, గణితం, సైన్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, ఇతిహాసాలు, జీవితచరిత్రలు, నవలా సాహిత్యం, ఆధ్యాత్మిక గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. 'పది' విద్యార్థుల పాలిసెట్, ఇతర పోటీ పరీక్షల పుస్తకాలు ఉన్నాయి. మొత్తం 11పోస్టులు మంజూరు కాగా ఇందులో గ్రేడ్–2 మూడు, గ్రేడ్–3 గ్రంథాలయంలో ఐదుగురు లైబ్రేరియన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ప్రస్తుతం లైబ్రేరియన్ నుంచి అటెండర్ వరకు దాదాపు 15నుంచి 20వరకు పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

ప్రమోషన్ పత్రాలు అందజేత



ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై బుధవారం 29 మంది ఉద్యోగులకు సర్వీస్ లింక్డ్ ప్రమోషన్ (ఎస్ఎల్‌పీ) పత్రాలను గని మేనేజర్ అల్లావుద్దీన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, కార్యదర్శి దాగం మల్లేశ్, రక్షణాధికారి సునీల్ కుమార్, పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, సంక్షేమాధికారి గౌస్ జీశాన్, ఇంజినీర్ బాబు, అండర్ మేనేజర్ నిఖిల్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ బైండోవర్

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన రౌడీషీటర్ కొప్పుల శ్రీనివాస్‌ను దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై కుందారపు ప్రసాద్ తెలిపారు. శ్రీనివాస్ పలు నేరాలకు పాల్పడటంతో మళ్లీ ఎలాంటి వివాదాలకు పాల్పడకుండా ఉండేందుకు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లారీ ఢీకొని మేస్త్రీ మృతి



ఆంజనేయులు(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి పాత బస్టాండ్‌లోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుంచాల ఆంజనేయులు (43) మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం మందమర్రిలోని దీపక్ నగర్‌కు చెందిన ఆంజనేయులు మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బైక్‌పై పనినిమిత్తం యాపల్ వైపు వెళ్తుండగా మంచిర్యాల వైపు నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టి కొంతదూరం వరకు ఈడ్చుకెళ్లింది. శరీరం నుజ్జునుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని గుండె కొంతదూరంలో పడి కొంతసేపు కొట్టుకున్న సంఘటన చూపరులను కలచివేసింది. లారీ డ్రైవర్ సమీపంలోని యాపల్ ప్రాంతంలో లారీని నిలిపాడు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ రామావతార్ శర్మపై కేసు నమోదు చేశారు. మృతునికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

చైనా మాంజాపై నిఘా



కాసిపేట: కోండపూర్‌యాపలో తనిఖీ చేస్తున్న డీఆర్‌వో ప్రవీణ్ నాయక్

- విక్రయించినా.. వినియోగించినా కఠిన చర్యలు
- ధనార్జనే ధ్యేయంగా వ్యాపారుల తీరు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు
- గతేడాది చైనా మాంజాకు ఒకరు బలి

మంచిర్యాలక్రైం: సంక్రాంతి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో గాలిపటాలను ఎగురవేసేందుకు ఉపయోగించే చైనా మాంజా వినియోగంపై రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి నిఘా పెంచారు. ఈ నెల 10 నుంచి పది రోజుల పాటు గాలిపటాలు విక్రయించే దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని గాలిపటాలు విక్రయించే దుకాణాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. చైనామాంజాపై నిషేధం ఉన్నప్పటికీ కొందరు సీజనల్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా చైనామాంజా విక్రయిస్తున్నారు. చైనామాంజాతో ఆకాశంలో విహరించే పక్షులకు, మానవులకు సైతం ఉరితాళ్లుగా మారే ప్రమాదం ఉంది.

'మామూలు'గా తీసుకున్న అధికారులు

నిబంధనల ప్రకారం చైనామాంజా విక్రయించే దుకాణాలపై అటవీ శాఖ అధికారులు దాడులు నిర్వహించాల్సి ఉండగా ఏటా సంక్రాంతికి ముందు పోలీసులు మాత్రమే అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నారు. అయినా చైనామాంజా లభించకపోవడం, ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు కాకపోవడంతో అధికారులు తనిఖీ చేసిన తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది.

విక్రయిస్తే చర్యలు...



చైనామాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అమ్మకాలు జరుపుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించండి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. 100కు లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు సమాచారం అందించండి.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

విక్రయిస్తే ఏడేళ్లు జైలు

2017 జూలై 17న తెలంగాణ ప్రభుత్వం చైనామాంజాను నిషేధించింది. విక్రయించిన వారికి ఏడేళ్ల జైలుశిక్ష, జరిమానా అమలు చేసింది. దీనిని వినియోగించడం వలన పక్షులు, జంతువులు, ద్విచక్ర వాహనదారులకు పతంగులు ఎగురవేసే వారికి సైతం ప్రాణహాని కలిగే అవకాశం ఉంటుందని వన్యప్రాణి ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థల అభ్యర్థన మేరకు గాజుపూత పూసిన చైనామాంజ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పర్యావరణ రక్షణ యాక్ట్ 1986, ప్రివెన్షన్ క్రూయేల్టీ టూ ఎనిమాల్స్ యాక్ట్ 1960 అమలులో ఉంది.

- 2022, జనవరి 16న పాత మంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జిపై చైనామాంజాకు తగిలి పస్తం భీమయ్య (40) అనే వలస కూలీ మృతి చెందిన సంఘటన కుటుంబంలో విషాదం నింపింది. ఘటన జరిగిన రోజు పోలీసులు గాలిపటాలు విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహించగా ఎక్కడా చైనామాంజా లభించకపోవడం గమనార్హం.
- గతేడాది హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో బజాజ్ కైట్స్ నిర్వాహకుడు భగవన్‌దాస్ బజాజ్‌కు చెందిన దుకాణంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా రూ.12 లక్షల విలువైన చైనామాంజా స్వాధీనం చేసుకున్న సంఘటన సంచలనం సృష్టించింది.

మంత్రాల నెపంతోనే వ్యక్తి హత్య

- కేసు ఛేదించిన తిర్యాణి పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్

తిర్యాణి(ఆసిఫాబాద్): మండలంలోని మానిక్యపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజ్‌గూడ శివారులో గత శనివారం జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అల్లం నరేందర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 5న తిరుపతి తన పంట చేనుకు కాపలాగా వెళ్లగా పథకం ప్రకారం ఐదుగురు వ్యక్తులు కలిసి హత్య చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్‌గూడలో తిరుపతి కొన్నిరోజులుగా సఖ్యంగా ఉండకపోవడం, నిందితుల్లో ఒకరైన నగేష్ తండ్రి మారుతికి కొన్నిరోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడం నగేష్‌లో అనుమానాలు పెంచింది. తన తండ్రికి తిరుపతి మంత్రాలు చేస్తున్నాడని అనుమానించసాగాడు. ఈ తరుణంలోనే నగేష్ బంధువులైన జుగునక హిరామన్, చిక్రం మారుతి, హర్షవర్ధన్, ఆత్రం చిన్ను సాయంతో హత్య చేశారు. హత్యకు ఉపయోగించిన టార్చిలైట్, గొడ్డళ్లు, మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్సై చుంచు రమేశ్, సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు ప్రభాకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఎంపికైన గురుకుల విద్యార్థులు

జైపూర్: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 10 వరకు నిర్వహించిన జిల్లాస్థాయి అట్యాపాట్య శిక్షణ శిబిరం నుంచి పి.రామ్, జె.వెంకటేశ్, కె.లక్ష్మీకాంత్, ఎస్.మణీశ్వర్, డి.జశ్వంత్, సీహెచ్.జశ్వంత్, కె.నిరంజన్, బి.సంజయ్, పి.లక్ష్మణ్ ఎంపికయ్యారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్, జిల్లా కోచ్ రాజలింగు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

'కడెం' మరమ్మతుకు చొరవ చూపండి



మంత్రికి విన్నవిస్తున్న నాయకులు

జన్నారం: రైతులకు వ్యవసాయ సాగుకు జీవనాధారమైన కడెం ప్రాజెక్టు ఆధునీకరణకు చొరవ చూపాలని జన్నారం మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు బుధవారం మంత్రి సీతక్కను కలిసి విన్నవించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఖానాపూర్ నియోజక వర్గంలోని కడెం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన మంత్రికి నాయకులు ముజాఫర్ అలీఖాన్, మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్‌రెడ్డి, ఏనుగు సుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లి జల ప్రళయం జరుగక ముందే స్పందించి, మరమ్మతులు చేయించాలని కోరారు.

బండ తరలిస్తున్న ట్రాక్టర్ల అడ్డగింత



ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

కాసిపేట: రొట్టెపల్లి గ్రామ పంచాయతీ శివారులోని నర్సింగసాగర్ చెరువు సమీపంలో ఉన్న గుట్టలను తవ్వి అక్రమంగా బండరాయిని తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్రమంగా గుట్టలు తవ్వవద్దని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ అధికారులకు ఫోన్ చేస్తే తమకు సంబంధంలేదని, అటవీ అధికారులకు తెలపాలని సూచించారన్నారు. అధికారుల అండదండలతో ట్రాక్టర్ యాజమానులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. మరోసారి అటువైపు రామని ఒప్పుకోవడంతో ట్రాక్టర్లను వదిలి పెట్టారు.

'పోలీస్' షార్ట్ ఫిలిం చిత్రీకరణ



బస్టాండ్ వద్ద చిత్రీకరిస్తున్న ఓ సన్నివేశం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్, ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా ప్రాంతంలో ఓ పోలీస్ అధికారి యూనిఫామ్‌లో హడావిడిగా పరుగెత్తుతున్న దృశ్యాలను చూసిన ప్రజలు 30 నిమిషాల పాటు అసలేం జరిగిందని అయోమయంలో పడిపోయారు. కొంత సమయం తర్వాత ఇదంతా ఓ షార్ట్ ఫిలిమ్ చిత్రీకరణ జరుగుతోందని తెలిశాక ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఫిలిం డైరెక్టర్ తిరుపతి కే.వర్మను వివరణ కోరగా ప్రజల భద్రతే లక్ష్యంగా పనిచేసే ఓ పోలీస్ అధికారి సాహసాలపై షార్ట్ ఫిలిం తీస్తున్నట్లు తెలిపారు. హీరోగా తోట మహేష్ (సీఐ క్యారెక్టర్) నటించాడని తెలిపారు.

రక్షణతో పనిచేస్తే ప్రమాదాలకు దూరం



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: రక్షణతో పనిచేస్తే ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కేహెచ్ఎన్ గుప్తా అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిపై రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్షణ పాటిస్తామని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతీ ఉద్యోగి విధి నిర్వహణలో రక్షణసూత్రాలు పాటించాలన్నారు. సంస్థకు బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో ఉద్యోగుల ప్రాణాల రక్షణ అంతే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ రాముడు, మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, సంక్షేమాధికారి పాల్‌సృజన్, ఇంజినీర్ కృష్ణ, వెంటిలేషన్ అధికారి చంద్రమౌళి, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన ఓదెలు



పుష్పగుచ్ఛం ఇస్తున్న నల్లాల ఓదెలు

మందమర్రిరూరల్: సింగరేణి నూతన సీఎండీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బలరాంను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో మర్యాద పూర్వకంగా ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు క్రాంతి ఉన్నారు.

'పెన్షన్ పెంపుదల కోసం పోరాడాలి'



మాట్లాడుతున్న రాంచందర్

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ పెంపుదల కోసం పోరాడాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సిద్దార్థనగర్‌లోని సీనియర్ సిటిజన్ హాల్‌లో రాష్ట కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల, సీపీఆర్ఎంఎస్ స్కీంలో వైద్యఖర్చుల పెంపుదల, ఇంటిస్థలం, తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న కోల్‌కత్తాలోని కోలిండియా కార్యాలయం, కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుపెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి వేణుమాదవ్, నాయకులు బీరయ్య, నర్సింగ్‌రావు, కనుకయ్య, ఉమాకర్, లక్ష్మీనారాయణ, జయంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యువ కవికి ఆహ్వానం



ఆత్రం మోతీరాం

వాంకిడి(ఆసిఫాబాద్): ఈ నెల 26 నుంచి 28 వరకు విశాఖపట్టణంలో నిర్వహించనున్న తెలుగు వికీపీడియా 20వ వార్షికోత్సవానికి వాంకిడి మండలం నగరిగుట్ట గ్రామానికి చెందిన ఆదివాసీ యువ కవి, రచయిత ఆత్రం మోతీరాంకు ఆహ్వానం అందింది. తెలుగు వికీపీడియాలో వ్యాసాలు రాయడం, కొలాం సంస్కృతికి సంబంధించి ఫొటోలు పొందుపర్చడం.. తదితర అంశాల్లో కృషికి ఆహ్వానం అందినట్లు మోతీరాం తెలిపారు. బోలి చేతో ఫౌండేషన్ సీఈవో నేతి సాయి కిరణ్, కొలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆత్రం భీంరావు, వసంత్‌రావు ఆయనను అభినందించారు.

మంచిర్యాలకు చేరిన విద్యార్థి మృతదేహం

- ఈ నెల 2న యూఎస్‌ఏలో గుండెపోటుతో మృతి



భార్గవ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: ఈ నెల 2న యూఎస్‌ఏలో గుండెపోటుతో మృతి చెందిన విద్యార్థి మృతదేహం బుధవారం మంచిర్యాలకు చేరుకుంది. పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన నరెడ్ల గిరి-లక్ష్మి దంపతుల కుమారుడు సాయి భార్గవ్ (30) మంచిర్యాలలో ఇంటర్, బీ టెక్ (ఈఈఈ) హైదరాబాద్‌లో పూర్తి చేశాడు అనంతరం ఉన్నత చదువుల నిమిత్తం యూఎస్‌ఏకు వెళ్లి అక్కడే ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2న గుండెపోటుకు గురై మృతి చెందడంతో అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొడుక మరణ వార్త విన్న ఆ కుటుంబ సభ్యులు వారం రోజులుగా శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం మృతదేహానికి గోదావరి తీరంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మంచిర్యాల గోదావరివద్ద బారికేడ్లు

మంచిర్యాలక్రైం: ఇసుక ట్రాక్టర్లు గోదావరినదిలోకి వెళ్లకుండా మైనింగ్ అధికారులు బుధవారం బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇసుక అక్రమ రవాణను నియంత్రించేందుకు కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం మైనింగ్, పోలీస్. రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మైనింగ్ ఏడీ బాలు పోలీసుల సహాయంతో పాత మంచిర్యాల, స్థానిక కాలేజీరోడ్‌లోని గోదావరి వద్ద ఇలా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

మార్కెట్ యార్డులోనే టోకెన్లు పొందాలి



మాట్లాడుతున్న సీపీవో ఉదయ్‌షా

చెన్నూర్: మార్కెట్ యార్డుకు పత్తి తీసుకువచ్చి రైతులు టోకెన్లు పొందాలని సీసీఐ సీపీవో ఉదయ్‌షా, మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిన్నింగ్ మిల్ యాజమానులు, ట్రేడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామన్నారు. పత్తిని విక్రయించే రైతులు వాహనాలలో 40 క్వింటాళ్లు మించకుండా తీసుకురావాలన్నారు. 8 నుంచి 12 శాతం తేమ ఉంటే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. మార్కెట్‌యార్డులో తేమ పరిశీలించిన తర్వాత టోకెన్లు పొందాలని సూచించారు.

కార్మెల్ విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: డిసెంబర్ 27 నుంచి 29 వరకు కేరళలో విద్యా అకాడమి ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజీ నిర్వహించిన ఇండియన్ స్పేస్ సైన్స్ (ఐఎస్ఎస్) ఒలింపియాడ్ జాతీయ స్థాయి ఫైనల్ పరీక్షలో మంచిర్యాల కార్మెల్ హైస్కూల్ విద్యార్థి హేమంత్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. 100 మార్కులకు గానూ 85 మార్కులు సాధించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కూచిపూడి నాట్యంలో విష్ణుప్రియ కళాకార్ బుక్ ఆఫ్‌వరల్డ్ రికార్డులో పేరు నమోదు చేసుకుంది. బుధవారం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిన్సీ, వైస్ ప్రిన్సిపాల్ టీస్సీ, సిస్టర్ లిల్లి విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రిన్సీ

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీజీఎం శ్రీనివాసరావు

జైపూర్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సింగరేణి డీజీఎం(ఐటీ) కార్పొరేట్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో బుధవారం జాతీయ సైబర్ సెక్యూరిటీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ కోల్, మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జాతీయ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిన్న బసివిరెడ్డి, ఏజీఎంలు శ్రీనివాసులు, ప్రసాద్, సుధాకర్, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపేటలో చోరీ

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన దావుద్‌ఖాన్ ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బుధవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులో దాచి ఉంచిన రెండు తులాల బంగారు, 38 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఎస్సై ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో వచ్చి పరిశీలించారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్ఐసీ ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలి

పాతమంచిర్యాల: జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో ఉద్యోగుల వేతన సవరణ చేపట్టాలని ఎల్ఐసీ సంస్థ ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. 17 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల వేతనాల సవరణ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారుల సంఘం నాయకులు మాలతిదేవి, సిరాపాణి, వికాసాధికారుల సంఘం నాయకులు సతీష్‌కుమార్, ప్రవీణ్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రమేష్‌బాబు, చరణ్, రాందాసు పాల్గొన్నారు.

సుందరకాండ పారాయణ పోస్టర్ల విడుదల

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఆవోపా ఆధ్వర్యంలో ఈ నెల 18నుంచి 21వరకు జిల్లా కేంద్రంలోని హైలైఫ్‌లో నిర్వహించే అష్టోత్తర శత సుందరకాండ పారాయణ సహిత శ్రీ రుద్రమహాయాగ కార్యక్రమం పోస్టర్లను బుధవారం హైలైఫ్‌లో విడుదల చేశారు. ఆవోపా ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్, సహస్ర అవధాని, పద్మశ్రీ, బ్రహ్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. గరికపాటి నరసింహారావుతో విశేష ప్రవచనాలుంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

సంక్షిప్త వార్తలు

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

భీమిని: కన్నెపల్లి గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యతగా తీర్చిదిద్దాలని డీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కన్నెపల్లి గ్రామాన్ని వంద శాతం అక్షరాస్యత గ్రామంగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యావాలంటరీలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని నిరక్షరాస్యులకు అక్షరాస్యత నేర్పే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, కొటారపు సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనదారులతో సమీక్ష సమావేశం

మందమర్రిరూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ హిట్ అండ్ రన్ చట్టంపై మందమర్రి సీఐ కార్యాలయ ఆవరణలో కేకే-ఓసీ, ఆర్కే ఓసీల్లో బొగ్గు రవాణా చేసే వాహనాల డ్రైవర్లు, ఓనర్లతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మందమర్రి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య హాజరై పలు సూచనలు చేశారు. కాగా, చట్టాన్ని లారీల డ్రైవర్లు, ఓనర్లు నిరసిస్తూ మంగళవారం నుంచి సమ్మెలో పాల్గొనగా బొగ్గు రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమావేశంలో కేకే-ఓసీ, ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ రమేష్ గోవిందరావు, మందమర్రి ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలి

జన్నారం: అర్హులైన ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల మేనేజ్‌మెంటు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గౌరి సతీశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల యాజమాన్యాల సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాల మేనేజ్‌మెంటు అసోసియేషన్ సమావేశంలో జిల్లా కమిటీని నియామకం చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడిగా బీ.సాయిలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా సీహెచ్.వెంకట్‌రెడ్డి, బీ.ప్రభాకర్‌రెడ్డి, భూమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డాక్టర్ అరవింద్ సేవలు ఎనలేనివి

మంచిర్యాలటౌన్: జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన ప్రముఖ ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ అరవింద్ సేవలు ఎనలేనివని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ వ్యక్తిగత కారణాలతో స్వచ్ఛందంగా తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయనను కలెక్టరేట్ కార్యాలయంలోని తన కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది డాక్టర్ అరవింద్, డాక్టర్ నూతన్ దంపతులను శాలువా కప్పి సత్కరించారు.